RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 455 | 23 ఆదివారం ఆగస్టు 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

# మహిళలు ఎవరికీ బానిసలు కారు..

## - మనుస్మృతి భావజాలంపై రాహుల్ గాంధీ ఫైర్



లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ, పితృస్వామ్య భావజాలంపై, ముఖ్యంగా 'మనుస్మృతి' నిర్దేశించిన పరిమితులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశానికి అసలైన బలం, ఆస్తి 70 కోట్ల మంది మహిళలేనని ఆయన స్పష్టం చేశారు. శనివారం పుణెలో "ఛాత్రోం కీ గూంజ్" కార్యక్రమంలో భాగంగా 'పింజ్రా తోడా' (పంజరాన్ని బద్దలుకొట్టండి) అనే థీమ్‌తో విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "దేశానికి అతిపెద్ద బలం ఏమిటని అడిగితే ఆర్థిక వ్యవస్థ, సైన్యం, జనాభా అంటూ రకరకాల సమాధానాలు చెబుతారు. కానీ నా దృష్టిలో భారతదేశానికి ఉన్న 70 కోట్ల మంది మహిళలే దేశానికి అతిపెద్ద శక్తి" అని అన్నారు. మహిళలు ఎవరికీ బానిసలు కారని ఉద్ఘాటించారు. బాల్యంలో ఉన్నప్పుడు తండ్రికి పనులు చేసిపెట్టడం కోసం, యవ్వనంలో భర్త కోసం, ఆ తర్వాత వృద్ధాప్యంలో కొడుకుల కోసం మహిళలు బతకాలనే మనుస్మృతి భావజాలం సిగ్గుచేటని విమర్శించారు. కుమార్తె, భార్య, తల్లి వంటి పాత్రలకే పరిమితం కాకుండా మహిళలు తమకంటూ ఒక సొంత గుర్తింపును ఏర్పరచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిషా అనే గిరిజన విద్యార్థిని ప్రసంగం అందరినీ కదిలించింది. గిరిజన విద్యార్థుల సమస్యలను ఆమె రాహుల్ గాంధీ దృష్టికి తీసుకొచ్చారు. పుణేలోని మంజరి ప్రాంతంలో తమ డిమాండ్ల సాధన కోసం గిరిజన విద్యార్థులు నిరాహార దీక్ష చేస్తున్నారని, వారి దుస్థితిని వివరిస్తూ ఒక వినతిపత్రాన్ని అందజేశారు. గిరిజన హాస్టళ్లలో కనీస వసతులు లేవని, 70-80 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేంద్రీకృత వంటశాలల నుంచి ఆహారం సరఫరా చేయడం వల్ల అది పాడైపోయి విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల గడ్చిరోలిలోని ఆశ్రమ పాఠశాలలో పాముకాటు కారణంగా ముగ్గురు విద్యార్థులు మరణించగా, మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని నిషా తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, సెలవులకు ఇంటికి వెళ్లి తిరిగి వచ్చిన గిరిజన విద్యార్థినులకు హాస్టళ్లలో బలవంతంగా గర్భ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని చెప్పడంతో సభలో నిశ్శబ్దం అలుముకుంది. ఈ సమస్యలపై మంత్రులను కలిస్తే ముఖ్యమంత్రి చేతుల్లోనే ఉందని చేతులెత్తేశారని, అలాంటప్పుడు వారికి పదవిలో ఉండే అర్హత లేదని ఆమె నిలదీశారు. విద్యార్థిని ఆవేదనకు స్పందించిన రాహుల్ గాంధీ, వారి నిరసన శిబిరానికి తనను ఆహ్వానించమని కోరారు. "నన్ను నిరసన స్థలానికి పిలవండి, నేను తప్పకుండా వస్తాను. నా రాకతో ప్రభుత్వం, యంత్రాంగంపై ఒత్తిడి పెరుగుతుంది" అని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూడా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందురోజు ఏబీవీపీ, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగిన నేపథ్యంలో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేయడంతో ఈవెంట్ ప్రశాంతంగా ముగిసింది.

# గచ్చిబౌలి విషాదం..

# అక్రమ భవనాలన్నీ కూల్చేస్తాం

## : హైడ్రా కమిషనర్



హైదరాబాద్ గచ్చిబౌలిలోని అంజయ్య నగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన నేపథ్యంలో 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్ శనివారం ఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాలన్నింటినీ నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామని హెచ్చరించారు. కేవలం 50 గజాల స్వల్ప విస్తీర్ణంలో నిబంధనలకు విరుద్ధంగా ఏడంతస్తుల భవనాన్ని నిర్మించడమే కాకుండా, దానిపై అదనంగా పెంట్‌హౌస్‌ను కూడా నిర్మించడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. బిల్డర్ సాజిద్ నిర్మించే భవనాలన్నీ అత్యంత నాసిరకంగా ఉంటాయని స్థానికులు ఆరోపిస్తున్నట్లు కమిషనర్ ఈ సందర్భంగా వెల్లడించారు. అంజయ్య నగర్ ప్రాంతంలో ఇటువంటి అక్రమ నిర్మాణాలు అనేకం ఉన్నాయని, కనీసం సెట్‌బ్యాక్‌లు కూడా పాటించకుండా బహుళ అంతస్తుల భవనాలను నిర్మించారని రంగనాథ్ పేర్కొన్నారు. నాలాలను ఆక్రమించి ఇష్టారాజ్యంగా కట్టడాలు చేపట్టారని, వీటిలో అధిక శాతం ప్రస్తుతం హాస్టళ్లుగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న ఆయా భవనాలను యజమానులు వెంటనే ఖాళీ చేయాలని ఆయన ఆదేశించారు. త్వరలోనే ఈ ప్రాంతంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన అన్ని భవనాలను కూల్చివేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

## నా కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న

# సూత్రధారులను గుర్తించాలి

## - : కొండా సురేఖ



తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి మరోసారి లేఖ రాశారు. కొందరు పార్టీ నేతలు ఉద్దేశపూర్వకంగా తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని ఆమె ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారి వెనుక ఉన్న సూత్రధారులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ ఛైర్మన్ మల్లు రవిని ఆమె కోరారు. కమిటీ పంపిన నోటీసుకు తాను ఇప్పటికే వివరణ ఇచ్చానని కొండా సురేఖ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఒక అంశంపై విచారణ కొనసాగుతున్న తరుణంలోనే, సొంత పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, ఇతర నేతలు బహిరంగంగా విమర్శలు చేయడం సమంజసం కాదని, ఈ విషయాన్ని కమిటీ తీవ్రంగా పరిగణించాలని ఆమె తన లేఖలో పేర్కొన్నారు. కాగా, ఈ లేఖ రాయడానికి ముందు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి ఈ అంశంపై స్పందించారు. కొండా సురేఖ సమర్పించిన వివరణపై కమిటీ ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలను ఒక బాధ్యతాయుతమైన మంత్రిగా సురేఖ ఖండించి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. సహజ న్యాయ సూత్రాల ప్రకారం ఆ వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని కొండా సురేఖ వాదిస్తున్నట్లు మల్లు రవి పేర్కొన్నారు. ఇదే సమయంలో, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోతో పాటు ఆయన ఇచ్చిన వివరణను కూడా పరిశీలించినట్లు వెల్లడించారు. ఇక కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, దీనిని సుమోటోగా స్వీకరించాలా? వద్దా? అనే అంశంపై యోచిస్తున్నామని ఆయన వివరించారు.

# రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు బ్రేక్..

## కేంద్రంపై ఖర్గే ఫైర్



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఖర్గే, విదేశీ పర్యటనల ద్వారా ముఖ్యమంత్రులు తమ రాష్ట్రాలకు పెట్టుబడులను ఆహ్వానిస్తారని పేర్కొన్నారు. "అమెరికాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ప్రవాస భారతీయులు అత్యధిక సంఖ్యలో నివసిస్తున్నారు. రాష్ట్రాల్లో పరిశ్రమల స్థాపనకు వారిని ఆహ్వానించేందుకే ముఖ్యమంత్రులు ఇటువంటి పర్యటనలు చేపడుతుంటారు. అలాంటి కీలక పర్యటనకు అనుమతి నిరాకరించడం అన్యాయం" అని ఆయన మండిపడ్డారు. "కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన వారికి తక్షణమే అనుమతులు మంజూరు చేస్తోంది, కానీ తెలంగాణ ముఖ్యమంత్రి విషయంలో మాత్రం వివక్ష చూపుతోంది" అని మల్లికార్జున ఖర్గే ఆక్షేపించారు. విదేశీ పెట్టుబడులు రావడం వల్ల రాష్ట్రంతో పాటు దేశం కూడా అభివృద్ధి చెందుతుందని, తద్వారా భారీగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, రాష్ట్రాలకు లభించే పెట్టుబడులు అంతిమంగా దేశాభివృద్ధికి తోడ్పడతాయని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి కీలక పర్యటనలను అడ్డుకోవడం ద్వారా తెలంగాణ ప్రగతికి విఘాతం కలిగించేలా కేంద్రం వ్యవహరించడం సరికాదని మల్లికార్జున ఖర్గే హితవు పలికారు.

## బీజేపీ కొత్త టీమ్‌తో

# ప్రధాని మోదీ భేటీ




- ఢిల్లీలో బీజేపీ నూతన జాతీయ కార్యవర్గంతో ప్రధాని మోదీ సమావేశం
- కొత్త ఆలోచనలతో పార్టీని బలోపేతం చేయాలని బృందానికి దిశానిర్దేశం
- యువతను లక్ష్యంగా చేసుకుని 'యువ సంవాద్' కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి
- యూపీ, పంజాబ్ ఎన్నికల సన్నద్ధతపై త్వరలో పార్టీ సమీక్ష 'వందేమాతరం'పై కాంగ్రెస్ వైఖరిని విమర్శిస్తూ బీజేపీ తీర్మానం

# ఆయుర్వేద చికిత్స కోసం కేరళ చేరుకున్న పవన్ కల్యాణ్



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కేరళ చేరుకున్నారు. ఇటీవల ముంబైలో శస్త్రచికిత్స చేయించుకున్న తన కుడి భుజానికి తదుపరి చికిత్సలో భాగంగా ఆయన ఆయుర్వేద వైద్యాన్ని ఆశ్రయించారు. శనివారం సాయంత్రం కొచ్చి విమానాశ్రయానికి చేరుకున్న ఆయన, అక్కడి నుంచి నేరుగా త్రిస్సూర్ బయలుదేరి వెళ్లారు. త్రిస్సూర్ సమీపంలో ఉన్న ఒక ప్రముఖ ఆయుర్వేద వైద్యశాలలో పవన్ కల్యాణ్ చేరారు. అక్కడ ప్రత్యేక థెరపీ ద్వారా ఆయనకు చికిత్స అందించనున్నారు. కొంతకాలంగా భుజం నొప్పితో బాధపడుతున్న పవన్ కల్యాణ్‌కు ఇటీవలే శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. దానికి కొనసాగింపుగా, పూర్తిస్థాయిలో కోలుకునేందుకు ఆయన ఈ ఆయుర్వేద చికిత్స తీసుకోనున్నట్లు సమాచారం. ఈ పర్యటన పూర్తిగా వ్యక్తిగతమైనదని, చికిత్స పూర్తయ్యే వరకు ఆయన వైద్యుల పర్యవేక్షణలోనే ఉండనున్నారని తెలుస్తోంది. పవన్ కల్యాణ్ వెంట పార్టీకి చెందిన కొందరు ముఖ్య నేతలు కూడా కేరళ వెళ్లినట్లు సమాచారం.

# తెలంగాణ విద్యార్థులంటే లెక్కలేదా?..

## - రాహుల్ గాంధీపై కేటీఆర్, కవిత ఫైర్



తెలంగాణలో విద్యార్థులపై పోలీసుల చర్యల విషయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మౌనం వహించడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో విద్యార్థుల కోసం ధర్నా చేసిన రాహుల్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన తెలంగాణలో జరుగుతున్న దాడులపై స్పందించకపోవడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని వారు ఆరోపించారు. శుక్రవారం కేటీఆర్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ రాహుల్ గాంధీ తీరును తప్పుబట్టారు.

"దేశంలో రెండు రకాల భారతాలు ఉన్నాయి. ఒకచోట విద్యార్థులపై లాఠీఛార్జ్ జరిగితే రాహుల్ గాంధీ ప్రశ్నిస్తారు, ధర్నాలు చేస్తారు. కానీ, కాంగ్రెస్ పాలనలో ఉన్న తెలంగాణలో విద్యార్థులను ఈడ్చుకెళ్తూ, గొంతు పట్టుకొని హింసిస్తున్నా పట్టించుకోరు. ఢిల్లీ తరహాలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి ముందు రాహుల్ గాంధీ ధర్నా చేస్తారా? లేక తెలంగాణ విద్యార్థులంటే మీకు లెక్కలేదా?" అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. ఇదే అంశంపై ఎమ్మెల్సీ కవిత కూడా స్పందిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 19న మహబూబాబాద్‌లో పాలిటెక్నిక్ విద్యార్థి గొంతును ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పట్టుకున్న వీడియోను ప్రస్తావిస్తూ ఆమె విమర్శలు గుప్పించారు. "ఢిల్లీ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎఫ్ఐఆర్ కోసం వెళ్లిన రాహుల్, తెలంగాణ ఘటనలపై ఎందుకు మౌనం వహిస్తున్నారు? ఇక్కడి విద్యార్థులను నేరస్థుల్లా చూస్తున్నారు. ఢిల్లీకి మీ ఆవేశం, తెలంగాణకు మీ మౌనం.. విద్యార్థులు మీ నుంచి ఇంతకంటే మెరుగైన తీరును ఆశిస్తున్నారు" అని కవిత అన్నారు.

# ఆదివాసీల హక్కుల కోసం చలమయ్య సేవలు చిరస్మరణీయం
## చలమయ్యకు ఘన నివాళులర్పించిన మడే పూర్ణిమ

మంగపేట, ఆగష్టు 22 హైదరాబాద్ ఎస్టేట్: ఆదివాసీ ప్రజల హక్కులు, అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన కల్తీ చలమయ్య సేవలు చిరస్మరణీయమని ములుగు జిల్లా కాంగ్రెస్ నాయకురాలు మడే పూర్ణిమ అన్నారు. మంగపేట మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన చలమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం నిర్వహించిన ఆయన దశదినకర్మ కార్యక్రమానికి హాజరైన మడే పూర్ణిమ.. చలమయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంస్మరణ సభలో ఆమె మాట్లాడుతూ.. ఆదివాసీ సమాజం అభ్యున్నతినే ధ్యేయంగా చేసుకుని చలమయ్య పనిచేసేవారని గుర్తుచేశారు. ఆదివాసీ యువత, మహిళలు విద్యావంతులై ఉన్నత స్థానాలకు ఎదగాలని, రాజకీయ, సామాజిక రంగాల్లో రాణించాలని నిరంతరం ఆకాంక్షించేవారని తెలిపారు. ఇందుకోసం ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు పలు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారని పేర్కొన్నారు. ఆదివాసీలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ పథకాలు, హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించడంలో చలమయ్య ముందుండేవారని మడే పూర్ణిమ అన్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు తమ హక్కుల సాధన కోసం ఆదివాసీ ప్రజలను చైతన్యపరిచేవారని గుర్తుచేశారు. సమాజం కోసం నిరంతరం తపించిన చలమయ్యను కోల్పోవడం ఆదివాసీ సమాజానికి తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు. చలమయ్య ఆశయాలను కొనసాగిస్తూ ఆదివాసీ యువత, మహిళలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ఉన్నత స్థాయికి



ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. చలమయ్య సేవలు, సామాజిక స్పృహను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని మడే పూర్ణిమ అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని చలమయ్యకు ఘన నివాళులర్పించారు.

# విద్యార్థులకు నష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది

హైదరాబాద్ ఎస్టేట్ 22 ఆగష్టు మంచిర్యాల రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనలను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ పార్టీ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ ఆరోపించారు. క్యాతనపల్లి మునిసిపాలిటీ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత పారిశ్రామిక రంగం వేగంగా మారుతున్న నేపథ్యంలో పాతబడిన సాంకేతిక సిలబస్‌తో విద్యార్థులు పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడం కష్టమవుతుందని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు అందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సంస్కరణలు చేపడుతోందని వివరించారు. ఌ×, రోబోటిక్స్, ఆటోమేషన్, ఆధునిక తయారీ సాంకేతికతలు వంటి భవిష్యత్ రంగాల్లో విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను అందించడం ద్వారా వారికి మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. హైదరాబాద్ లోని మాసబ్ ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల వద్ద విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిన వెంటనే తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు మరియు మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి స్వయంగా అక్కడికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడటం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల సమస్యలను, సందేహాలను మంత్రి స్వయంగా విని, ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణల ఉద్దేశ్యాన్ని వివరించారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి నష్టం జరగదని మంత్రి వారికి భరోసా



ఇచ్చారని పేర్కొన్నారు. ఆ క్రమంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడిన మాటలు వక్రీకరించడం బీఆర్ఎస్ దివాళాకోరు రాజకీయాలకు పరాకాష్ట అని అన్నారు. ఖు= , తన అనుచరులు చేస్తున్న అసత్య ప్రచారాలు, దుష్ప్రచారాలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌లను వెంటనే నిలిపివేయాలని హెచ్చరించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, కేటీఆర్ మరియు బీఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ధి కోసం విద్యార్థులను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తును రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకోవడం బాధ్యతారాహిత్యమని అన్నారు. జీవో నంబర్ 97 ద్వారా పాలిటెక్నిక్ నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను ఆధునికీకరించి శక్తి స్కీం ద్వారా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో అనుసంధానం చేసే చర్యలను ప్రభుత్వం చేపడుతోందని తెలిపారు.

విద్యార్థులు సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మకుండా అధికారిక సమాచారం ఆధారంగా తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఆయన సూచించారు. డిప్లొమా విద్యార్థులకు ఉన్నత విద్యలో కొనసాగేందుకు లెటరల్ ఎంట్రీ ద్వారా బీటెక్ రెండో సంవత్సరంలో ప్రవేశించే అవకాశం యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. విద్యా వ్యవస్థపై బీఆర్ఎస్ నాయకులు మాట్లాడే ముందు తమ పదేళ్ల పాలనలో జరిగిన పరిణామాలను గుర్తు చేసుకోవాలని సూచించారు. గ్లోబరీనా సంస్థకు సంబంధించిన ఇంటర్మీడియట్ పరీక్షల అవకతవకల వ్యవహారం, విద్యార్థుల ఆత్మహత్యలు, గ్రూప్-1 పరీక్షల రద్దు వంటి పరిణామాలు రాష్ట్ర ప్రజల జ్ఞాపకాల్లో ఇంకా ఉన్నాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, వారిని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకుండా ప్రభుత్వం తీసుకుంటున్న సంస్కరణలపై నిర్మాణాత్మక సూచనలు చేయాలని బీఆర్ఎస్ నాయకులకు హితవు పలికారు.

విద్యార్థుల భవిష్యత్తు విషయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని, ఆధునిక సాంకేతిక విద్య ద్వారా తెలంగాణ యువతకు దేశ, అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు దాముక శిరీష, భీమ మల్లేష్, కూతురు ప్రభాకర్, అధికార ప్రతినిధి మొట్టె సుధాకర్, పట్టణ ఉపాధ్యక్షురాలు సృజన, ప్రధాన కార్యదర్శులు గోపు రాజం, ఏల్పుల సత్యనారాయణ, అధికార ప్రతినిధి రాజ్ కుమార్, కార్యదర్శులు పైడాకుల శ్రీనివాస్, నర్రా శ్రీనివాస్, వెనిగల శ్రీనివాస రావు, నాయకులు జోగుల వెంకటేశ్వర్లు, దాముక రమేష్, పచ్చిక లక్ష్మారెడ్డి, నరేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లో జాతీయ లోక్ అదాలత్‌పై కోఆర్డినేషన్ మీటింగ్

హుస్నాబాద్: సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు హుస్నాబాద్ కోర్టులో కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించిన ఏర్పాట్లు, కేసుల పరిష్కారం, న్యాయవాదులు, పోలీసు అధికారులు మరియు సంబంధిత శాఖల మధ్య సమన్వయంపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో అడిషనల్ న్యాయమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. కొంతమంది కక్షిదారులు న్యాయవాది ప్రమేయం లేకుండా కాంప్రమైజ్ పిటిషన్లు దాఖలు చేస్తున్నారని న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. న్యాయవాది ప్రమేయం లేకుండా జరిగే ఇలాంటి రాజీలను అనుమతించకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మండల్ లీగల్ సెల్ ఇన్‌చార్జి బొజ్జ కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో






ముందస్తు సమన్వయం కోసం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీ మార్గంలో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో హుస్నాబాద్, బెజ్జంకి ఎస్ఐలు లక్ష్మారెడ్డి, తిరుపతి, కోహెడ ఎస్ఐ మొగిలి నాయక్, బాకం సంపత్ కుమార్, కన్నోజు రామకృష్ణ, చిత్తరి హనుమయ్య, జుమ్లాల్ నాయక్, జే. కిరణ్ కుమార్, సుంకె రాజశేఖర్, డికొండ ప్రవీణ్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి సంబంధిత న్యాయవాదులు, పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశంలో సూచించారు.

# భక్తిశ్రద్ధలతో కాటమయ్య బోనాలు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 22:- ఆదిభట్ల: ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తుర్కయంజాల్ డివిజన్ మన్నెగూడ, ఎస్ఎన్ఆర్ నగర్ కాలనీలో కాటమయ్య బోనాల వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం కాటమయ్య స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో భాగంగా పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పు వాయిద్యాలతో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన బోనాలతో నిర్వహించిన ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది. సంప్రదాయబద్ధంగా సాగిన ఊరేగింపు కాటమయ్య ఆలయం వరకు కొనసాగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్న భక్తులు కుటుంబసమేతంగా మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కాటమయ్య గుడి అధ్యక్షుడు కేశమోని రాజాగౌడ్ (జంగయ్యగౌడ్)తో పాటు గౌడ్ సంఘం పెద్దలు పొట్ల జంగయ్యగౌడ్, వట్నాల ధనంజయగౌడ్, ఎడ్ల నారాయణగౌడ్, కాట్ల శ్రీనివాస్‌గౌడ్, మట్ట మల్లేష్‌గౌడ్, ఆల్దాస్ యాదగిరిగౌడ్, గౌని తిరుపతయ్యగౌడ్, గునిగంటి జంగయ్యగౌడ్, పల్లె కుమార్‌గౌడ్, సీఎం



జంగయ్యగౌడ్, పొట్ల సాయిలుగౌడ్, వెంకటేష్‌గౌడ్, మట్ట రమేష్‌గౌడ్, జినుగుంట్ల నరసింహగౌడ్, జినుగుంట్ల శ్రీరాములు, జినుకుంట్ల భుజంగంగౌడ్, చారిగొండ సత్యయ్యగౌడ్, పల్స బాలరాజ్‌గౌడ్, ముచ్చర మల్లేష్‌గౌడ్, కేశమోని అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నశంకరంపేట సోషల్ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ కు ఘన సన్మానం

మెదక్,ఆగస్టు22(హైదరాబాద్ ఎస్టేట్):మెదక్ జిల్లా,చిన్నశంకరం పేట సోషల్ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ తులసీ రామ్ ను శనివారం రోజు చిన్నశంకరం పేట మండల పద్మశాలి సంఘం నాయకులు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎర్రగంటి కృష్ణయ్య,ఉడుత శ్రీమన్నారాయణ, తుమ్మ శంకరయ్య,ముదిగొండ శివకుమార్,చిప్ప కృష్ణ, బైండ్ల బాలరాజ్,వనం నర్సింలు,తదితరులు పాల్గొన్నారు.



# కురుమ సోదరునికి ఆర్థిక సహాయం అందించిన .. కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర కమిటీ.

హైదరాబాద్ ఎస్టేట్ 22 08 2026 శనివారం ఎల్బీనగర్ .

ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న మాల్గా శ్రీశైలం కురుమ గారిని వారి నివాసంలో కలిసి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కుండే



వెంకటేష్ కురుమ గారు మరియు కే వై సీ ఎస్ నాయకులు. ఈ సందర్భంగా శ్రీశైలం కురుమ గారికి ఆర్థిక సహాయం అందించి, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. కష్టకాలంలో ఉన్న కురుమ సోదరుడికి అండగా నిలిచి, మానవతా దృక్పథంతో సహాయం అందించిన కుండే వెంకటేష్ కురుమ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మందుల సత్యం కురుమ, కోశాధికారి రావుల ఐలయ్య కురుమ సలహాదారులు అది కృష్ణయ్య కురుమ, ఎల్ బి నగర్ అధ్యక్షులు కాల్నేమల్లేశం కురుమ, ఎల్ బి నగర్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలం శ్రీనివాస్ కురుమ, ప్రచార కార్యదర్శి బండారు శ్రీశైలం కురుమ, యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జీ కేమిడి ఉపేందర్ కురుమ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల్లో శారీరక చైతన్యానికి శ్రీకారం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 22:-

తెలంగాణలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరిలో శారీరక చైతన్యాన్ని పెంపొందించడమే యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (YIPESU) ప్రధాన లక్ష్యమని వైస్‌ఛాన్సలర్ డా. కిషోర్ గోపీనాథన్ తెలిపారు. జిల్లా




స్థాయిలో ఫిజికల్ లిటరసీ కార్యక్రమాల అమలుపై యూనివర్సిటీ ఆధ్వర్యంలో, ఇంటర్నేషనల్ ఫిజికల్ లిటరసీ అసోసియేషన్ సహకారంతో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్చువల్ ఓరియంటేషన్ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫిజికల్ లిటరసీ ప్రాధాన్యత, కార్యక్రమాల అమలుపై అధికారులు చర్చించారు. డా. కిషోర్ గోపీనాథన్ మాట్లాడుతూ ఫిజికల్ లిటరసీ అంటే కేవలం క్రీడల్లో పాల్గొనడం మాత్రమే కాదని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవడంలో భాగమని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధునిక క్రీడలతో పాటు సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించి ప్రజలను నిత్యం శారీరకంగా చురుకుగా ఉండేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి జిల్లాలో యువజన, క్రీడల శాఖ అధికారుల సమన్వయంతో అన్ని వయస్సుల వారికి చేరువయ్యేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. జిల్లా ఫిజికల్ లిటరసీ కోఆర్డినేటర్లు కలెక్టర్, సామాజిక ప్రభావశీలులు, వివిధ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ఇంటర్నేషనల్ ఫిజికల్ లిటరసీ అసోసియేషన్ ప్రతినిధి అమిత్ మాలిక్ మాట్లాడుతూ ఇప్పటికే 50 దేశాల్లో ఫిజికల్ లిటరసీ కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. శరీరం, మనస్సు, హృదయం సమన్వయంతోనే సంపూర్ణ ఫిజికల్ లిటరసీ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్. స్వర్ణలత, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఎస్సీ అభివృద్ధి అధికారి రామారావు, సీడీపీఓ జి. శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ నర్సింగ్ కాలేజీలో విద్యార్థినుల ఫైట్.. పలువురికి గాయాలు



ఓ సెల్‌ఫోన్ వ్యవహారం నర్సింగ్ విద్యార్థినుల మధ్య పెద్ద ఘర్షణకు దారితీసింది. కాకినాడలోని ఎస్‌కే కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో చదువుకుంటున్న ఆంధ్రప్రదేశ్, మణిపూర్ రాష్ట్రాలకు చెందిన విద్యార్థినులు రోడ్డుపైకి వచ్చి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. అధికారుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. వివరాల్లోకి వెళితే.. కళాశాల హాస్టల్‌లో ఉంటున్న మణిపూర్‌కు చెందిన ఓ విద్యార్థిని తన సెల్‌ఫోన్ కనిపించడం లేదని ఇటీవల సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత ఫోన్ దొరికినప్పటికీ, ఈ విషయంపై విద్యార్థినుల మధ్య వివాదం సద్దుమణగలేదు. మాటామాటా పెరిగి పరిస్థితి తీవ్రరూపం దాల్చింది. రెండు వర్గాల విద్యార్థినులు హాస్టల్ నుంచి బయటకు వచ్చి రోడ్డుపైనే ఘర్షణకు దిగారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ దాడిలో పలువురు విద్యార్థినులకు స్వల్ప గాయాలవగా, ఇద్దరిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే కళాశాల వద్దకు చేరుకున్నారు. ఆర్డీవో, ట్రైనీ జేసీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కూడా సంఘటనా స్థలానికి వచ్చి విద్యార్థినులతో మాట్లాడారు. వారికి నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అధికారులు తక్షణ చర్యగా మణిపూర్‌కు చెందిన విద్యార్థినులను వేరే హాస్టల్‌కు తరలించారు. ఈ ఘటన నేపథ్యంలో అసలు కళాశాలకు సరైన అనుమతులు ఉన్నాయా, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు ఎలా ఉన్నాయి అనే కోణంలో అధికారులు విచారణ ప్రారంభించారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in
23 ఆదివారం ఆగస్టు 2026

# రైతులకు అవగాహన లేక దరి చేరని పట్టు మల్బరీ పంటల సాగు పెంపకం




మెదక్,ఆగస్టు22(హైద్రాబాద్ ఎస్టేట్): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు సబ్సిడీలు ఇస్తున్నప్పటికీ అధికారుల అవగాహన లోపంతో పట్టు పరిశ్రమపై పట్టు కోల్పోతుంది.దీనితో పట్టు పురుగుల పెంపకం రోజు రోజుకు అడుగంటి పోతుందని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు అందిస్తే రైతులు ఎక్కువగా లాభాలు గడించవచ్చని రైతులు కోరుతున్నారు.పట్టు పురుగుల పెంపకానికి, మల్బరీ సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు అందిస్తున్నప్పటికీ అవగాహన రాహిత్యంతో అవి లబ్ది దారులకు దరి చేరటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి రైతులకు సబ్సిడీలు అందిస్తూ, అవగాహన కల్పించాలని కోరుతున్నారు.ఎస్సీ,ఎస్టీలకు అదికంగా సబ్సిడీలు అసిస్టెంట్ డైరెక్టర్ లింగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మల్బరీ పరిశ్రమ స్థాపించడం కోసం ఎస్సీ,ఎస్టీలకు అదికంగా సబ్సిడీలు మంజూరు చేస్తున్నట్లు సేరికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ లింగం తెలిపారు.రైతులు మల్బరీ పంటలపై దృష్టి సారించాలి రైతులు మల్బరీ పంటలపై దృష్టి సారించాలని మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని జయరాం తండా రైతు లంబాడి సర్వాన్ పేర్కొన్నారు. శనివారం రోజు ఆయన పట్ట పురుగుల సాగు పంటను,షెడ్ ను "హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి" సంప్రదించి మాట్లాడారు.రైతులు ఆరుతడి పంటలు,ఎల్ నినో ప్రభావం వరి పంటలపై ప్రభావం చూపుతున్నందున మల్బరీ సాగుపై దృష్టి కేంద్రీకరించాలని,దీనితో అనేక లాభాలున్నాయని ఆయన పేర్కొన్నారు. దేవి సింగ్ గిరిజన తండా రైతు రైతులు ఎక్కువగా మల్బరీ సాగు పై దృష్టి సారించాలని దీనితో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలున్నాయని గిరిజన తండాకు చెందిన రైతు లంబాడి దేవి సింగ్ పేర్కొన్నారు.

# విద్యార్థులపై లాఠీచార్జ్ దారుణం




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 22:- ఇబ్రహీంపట్నం: జీవో నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రామోజీ ఫిలిం సిటీ సమీపంలో శాంతియుతంగా నిరసన చేపట్టిన ఎస్‌జీఎం డిప్లొమా విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ ఘటనపై మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులపై పోలీసుల చర్యను ఖండిస్తూ ఘటనకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ నేపథ్యంలో శనివారం ఎస్‌జీఎం కళాశాలకు వెళ్లిన బూర నర్సయ్య గౌడ్, 53, 56 డివిజన్ల జీహెచ్ఎంసీ అధ్యక్షుడు ఎలిమినేటి నర్సింహారెడ్డిలు లాఠీచార్జ్‌లో గాయపడిన విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన జీవో 97ను రద్దు చేయాలన్న డిమాండ్‌తో వారు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన చేపట్టారని తెలిపారు. అలాంటి శాంతియుత ఆందోళనను అణచివేసేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేయడం బాధాకరమన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన పోలీసులే విద్యార్థులపై విచక్షణారహితంగా వ్యవహరించడం సమర్థనీయం కాదన్నారు. ఇది విద్యార్థుల హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు.లాఠీచార్జ్‌కు బాధ్యుడైన సీఐను వెంటనే సస్పెండ్ చేసి, గాయపడిన విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు అన్ని వేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఎస్‌జీఎం విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై విద్యార్థులకు ట్రాఫిక్ పాఠాలు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 22:- ఇబ్రహీంపట్నం: రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడంతో పాటు బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లను పెంచే లక్ష్యంతో కేశవ్ మెమోరియల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జితేందర్ రెడ్డి విద్యార్థులతో మాట్లాడి పలు కీలక సూచనలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలను నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ రహదారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతో పాటు దానిని సక్రమంగా ఉపయోగించాలని తెలిపారు. హెల్మెట్ వినియోగం ప్రమాద సమయంలో తలకు కలిగే గాయాల తీవ్రతను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. అతివేగం, రాంగ్‌రూట్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వంటి నిబంధనల ఉల్లంఘనలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. వాహనం నడిపే సమయంలో చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతుందని హెచ్చరించారు. రోడ్డుపై అప్రమత్తంగా ఉంటూ ఇతర వాహనదారుల కదలికలను గమనించడం, ప్రమాదాలను ముందుగానే అంచనా వేసి వాహనం నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని చెప్పారు. విద్యార్థులు స్వయంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోనూ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు.

# ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలకు పోస్టర్ ఆవిష్కరణ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్
తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో, తెలంగాణ ఉద్యమ జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమ జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు జన్నె యుగేందర్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలోని వివిధ జానపద కళారూపాలను పరిరక్షిస్తూ, కళాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని కళారూపాలకు చెందిన కళాకారులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రేగొండ మండల అధ్యక్షులు పున్నం రవి, తెలంగాణ ఉద్యమ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండ్ర కుమార్, రాష్ట్ర కల్చరల్ ఇన్‌చార్జ్, ములుగు జిల్లా అధ్యక్షులు మోతే రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కనుకుంట్ల సంధ్య తదితరులు పాల్గొన్నారు.




# పని ఇప్పిస్తానంటూ నమ్మించి.. బంగారం అపహరణ



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 22:- హైదరాబాద్ కమిషనరేట్ ఆదిభట్ల: కూలీ పని ఇప్పిస్తానని నమ్మించి మహిళను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బంగారు గొలుసు అపహరించిన ఘటనలో నిందితుడిని ఆదిభట్ల పోలీసులు 48 గంటల్లోనే పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎన్‌జీవోస్ కాలనీలో కూలీ పని కోసం ఎదురుచూస్తున్న 56 ఏళ్ల మహిళను గజ్జ విజయ్‌కుమార్ గౌడ్ అనే వ్యక్తి సంప్రదించాడు. మన్నెగూడలో మేస్త్రీ పని ఉందని, రోజుకు రూ.900 కూలీ ఇస్తానని చెప్పి తన ద్విచక్ర వాహనంపై ఆమెను తీసుకెళ్లాడు. మన్నెగూడ నుంచి ఆదిభట్ల వైపు వస్తూ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుకు సమీపంలోని ఖాళీ ప్రదేశానికి తీసుకెళ్లాడు. అక్కడ గడ్డి పీకే పని చేయాలని చెప్పి, సిమెంట్ తీసుకొస్తానంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చిన నిందితుడు మహిళను బెదిరించి, ఆమె మెడలో ఉన్న నల్లపూసలు, బంగారు బిళ్లలతో కూడిన సుమారు 12 గ్రాముల గొలుసును అపహరించి ద్విచక్ర వాహనంపై పరారైనట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి నిందితుడి కదలికలను గుర్తించారు. శనివారం బొంగులూరులోని ఓ బంగారు దుకాణం వద్ద చోరీ చేసిన బంగారాన్ని విక్రయించేందుకు వచ్చిన సమయంలో విజయ్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి చోరీకి గురైన 12 గ్రాముల బంగారు గొలుసుతో పాటు నేరానికి ఉపయోగించిన హీరో స్ప్లెండర్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతోనే నేరానికి పాల్పడినట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. ఏసీపీ డీవీ ప్రదీప్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేష్, ఎస్ఐ నోయెల్‌రాజ్, హెడ్ కానిస్టేబుల్ రవికుమార్, కానిస్టేబుల్ కిరణ్ రెడ్డి, ఎల్లయ్య, ఉపేందర్, శివచంద్ర, భరత్, ఆధ్వర్యంలో కేసును ఛేదించారు. పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

# ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల సత్తా

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 22:- ఇబ్రహీంపట్నం: రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ కళాశాల విద్యాశాఖ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన "జిజ్ఞాస 202526" రాష్ట్రస్థాయి పోటీలకు కళాశాల నుంచి నాలుగు ప్రాజెక్టులు ఎంపికై ప్రదర్శనకు అవకాశం దక్కించుకున్నాయి. ఇంగ్లీష్, చరిత్ర, వాణిజ్యశాస్త్రం, వృక్షశాస్త్ర విభాగాలకు చెందిన విద్యార్థులు వివిధ సమకాలీన అంశాలను ఎంచుకుని అధ్యయనం చేశారు. అధ్యాపకుల మార్గదర్శకత్వంలో సమాచారాన్ని సేకరించి, పరిశోధనాత్మకంగా ప్రాజెక్టులను రూపొందించారు. రాష్ట్రస్థాయి వేదికపై తమ పరిశోధన అంశాలను వివరించి ఆకట్టుకున్నారు. చరిత్ర విభాగం ప్రాజెక్టుకు డా. సి.వి. పవన్ కుమార్, వాణిజ్యశాస్త్రం ప్రాజెక్టుకు డా. ఇ. శంకర్, వృక్షశాస్త్రం ప్రాజెక్టుకు డా. ఎ. రచన పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ఇంగ్లీష్ విభాగం ప్రాజెక్టుకు డీఎస్-ఎస్ఆర్ క్రిష్ణ మార్గనిర్దేశం చేయగా, కళాశాల స్థాయిలో జిజ్ఞాస కార్యక్రమ సమన్వయకర్తగా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. ఎస్. రాధిక మాట్లాడుతూ నాలుగు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమని అన్నారు. విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు, పర్యవేక్షక అధ్యాపకులను ఆమె అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ డా. కె. సురేష్‌తో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.




# పత్రికా విలేఖరులు మరియు మీడియా ప్రతినిధులకు నమస్కారం..

## వరంగల్ వెస్ట్ నియోజకవర్గ (GWMC) 26 - డివిజన్ ప్రెసిడెంట్ల నియామకాన్ని ఆమోదించిన టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్.. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసిన డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
తేదీ: 22-08-2026
వరంగల్ వెస్ట్ నియోజకవర్గ పరిధిలోని వివిధ (+ఔవీజ) 26 నూతన డివిజన్ల ప్రెసిడెంట్ల నియామక ప్రతిపాదనలకు టీపీసీసీ ఆమోదం తెలిపింది. ఈ మేరకు డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన డివిజన్ ప్రెసిడెంట్లు పార్టీ బలోపేతానికి, క్షేత్రస్థాయి నుండి సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడానికి అంకితభావంతో కృషి చేయాలని పార్టీ నాయకత్వం ఆకాంక్షించింది. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన డివిజన్ ప్రెసిడెంట్లకు హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గారు తమ హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు.

నియమితులైన వరంగల్ వెస్ట్ నియోజకవర్గ (+ఔవీజ) డివిజన్ ప్రెసిడెంట్ల వివరాలు :

1. డివిజన్ 4: బాషబోయిన శ్రీధర్ యాదవ్
2. డివిజన్ 5: సోమ కరుణ శ్రీ
3. డివిజన్ 6: మహమ్మద్ ఆజం
4. డివిజన్ 7: పోలు లక్ష్మీనారాయణ
5. డివిజన్ 8: సీతా శ్యామ్
6. డివిజన్ 9: భీమా వినయ్
7. డివిజన్ 10: మహమ్మద్ ఫిరోజ్ ఖాన్
8. డివిజన్ 11: ఎండీ. సమద్
9. డివిజన్ 29: బొమ్మ సురేష్
10. డివిజన్ 30: రాజ్ కుమార్
11. డివిజన్ 31: సత్తు రమేష్
12. డివిజన్ 47: దొంగల కుమార్
13. డివిజన్ 48: చందు
14. డివిజన్ 49: నాగపురి కరణ్
15. డివిజన్ 50: బషీర్
16. డివిజన్ 51: కరీం
17. డివిజన్ 52: తడుక సుమన్
18. డివిజన్ 53: ఎర్ర మహేందర్
19. డివిజన్ 54: సుమన్
20. డివిజన్ 57: అశోక్ రెడ్డి
21. డివిజన్ 58: తాళ్లపెల్లి సుధాకర్
22. డివిజన్ 59: దీపక్ రెడ్డి
23. డివిజన్ 60: బుస్స నవీన్
24. డివిజన్ 61: అర్కవత్ లక్ష్మణ్ నాయక్
25. డివిజన్ 62: పాలడుగుల ఆంజనేయులు
26. డివిజన్ 63: విజయశ్రీ రజాలి

ఇనగాల వెంకట్రామ్ రెడ్డి
అధ్యక్షులు, హనుమకొండ డిసిసి.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# ఓకే ఒక్క బస్సుతో విద్యార్థుల అగచాట్లు

## అన్నారంఅబ్లాపూర్ చిత్రియాల్ ఎక్స్ రోడ్డు వరకు మరో బస్సు ఏర్పాటు చేయాలని విద్యార్థులు,సర్పంచ్ లు గ్రామస్థుల విజ్ఞప్తి

మెదక్,ఆగస్టు 22(హైద్రాబాద్ ఎస్టేట్):మెదక్ జిల్లా,పాపన్నపేట మండల పరిధిలోని అన్నారం గ్రామ విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కష్టంగా మారింది.మెదక్ నుంచి కొడపాకకు ప్రస్తుతం ఒకే ఒక్క బస్సు సర్వీసు నడపటంతో అన్నారం, అబ్లాపూర్ గ్రామాల విద్యార్థులు,ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో మెదక్ నుంచి నాగ్స న్ పల్లి మీదుగా కొడపాకకు ఒక సర్వీసుతో పాటు మరో సర్వీసు అన్నారం, అబ్లాపూర్,గాజులగూడెం మీదుగా కొడపాకకు వెళ్లి అక్కడి నుంచి తిరిగి మెదక్‌కు వచ్చేది. దీంతో విద్యార్థులు, ప్రయాణికులకు కొంతమేర కు రవాణా సౌకర్యం ఉండేది.కాగా ఏడుపాయల వైపు నుంచి కొడపాకకు వచ్చే బస్సు సర్వీసు నిలిచిపోవడంతో ప్రస్తుతం మెదక్‌కొడపాక మార్గంలో అందుబాటులో ఉన్న సర్వీసుపైనే ప్రయాణికులు ఆధారపడాల్సి వస్తోంది. కొడపాక నుంచి వచ్చే విద్యార్థులు, ప్రయాణికులతో బస్సు ముందుగానే నిండిపోతుండటంతో అన్నారం గ్రామానికి చేరుకునే సమయానికి బస్సులో ఖాళీ లేకుండా పోతోంది.దీంతో అన్నారం గ్రామంలో బస్సు నిలిపినా విద్యార్థులు, ప్రయాణికులను ఎక్కించుకునే పరిస్థితి లేకపోవడంతో బస్సు ఆగకుండా వెళ్లిపోతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

దీంతో అన్నారం గ్రామానికి చెందిన పాఠశాల, కళాశాల విద్యార్థులు ఉదయం వేళ బస్సు కోసం రోడ్డుపై వేచి చూడాల్సి వస్తోంది. బస్సు వచ్చినా ఎక్కేందుకు అవకాశం లేకపోవడంతో విద్యాసంస్థలకు సమయానికి చేరుకోలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం ఉన్న ఒకే సర్వీసు కొడపాక నుంచే ప్రయాణికులతో నిండిపోవడంతో అన్నారం,అబ్లాపూర్ గ్రామాల ప్రజలకు, విద్యార్థులకు సరైన రవాణా సౌకర్యం అందడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఉదయం పాఠశాల,కళాశాలలకు వెళ్లే విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ అధికారులు అదనపు బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

అన్నారంఅబ్లాపూర్ గాజులగూడెం గ్రామాల మీదుగా కొడపాక వరకు మరో బస్సు సర్వీసును ఏర్పాటు చేసి,అక్కడి నుంచి మెదక్‌కు తిరిగి వెళ్లేలా చర్యలు తీసుకుంటే విద్యార్థులతో పాటు ఆయా గ్రామాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని గ్రామస్థులు






చెబుతున్నారు.గతంలోఉన్న సర్వీసులను పునరుద్ధరించడంతో పాటు విద్యార్థుల రాకపోకలకు అనుకూలంగా అదనపు బస్సు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఆర్టీసీ డిపో అధికారులు స్పందించి అన్నారం గ్రామంలో బస్సు ఆగేలా, విద్యార్థులు సమయానికి పాఠశాలలు,కళాశాలలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు,గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.ఈవిషయమై మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్ పరమేశ్వరిని వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆమె ఫోన్ లిఫ్ట్ చేయలేదు

# కమ్యూనిస్టు ఉద్యమానికి సురవరం సుధాకర్ రెడ్డి దిక్సూచి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 22:- అబ్దుల్లాపూర్‌మెట్: కమ్యూనిస్టు ఉద్యమానికి సురవరం సుధాకర్‌రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని రావి నారాయణరెడ్డి కాలనీ ఫేజ్3 భూ పోరాట కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన నివాళి కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. నల్గొండ పార్లమెంట్ సభ్యుడిగా, సీపీఐ జాతీయ కార్యదర్శిగా సుధాకర్‌రెడ్డి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడారని గుర్తుచేశారు.

మతోన్మాద రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ, భిన్న రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు సైతం ఆయన వ్యక్తిత్వాన్ని, నిబద్ధతను గౌరవించేవారని తెలిపారు. పేదల గుడిసెలను తొలగించే ప్రయత్నాలు జరిగిన సమయంలో పార్లమెంట్‌లో ఉన్నప్పటికీ స్థానిక ప్రజల సమస్యపై స్పందించి అండగా నిలిచిన ఘనత సురవరం సుధాకర్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రావి




నారాయణరెడ్డి కాలనీల అభివృద్ధికి కూడా కమ్యూనిస్టు పార్టీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. పేదలకు ఇళ్లు, భూములు, మౌలిక సదుపాయాల కోసం సీపీఐ పోరాటం కొనసాగిస్తుందని చెప్పారు. 'బద్లావ్ జరూరీ హై.. మార్పు కావాలి' నినాదంతో ఈ నెల 17 నుంచి 21 వరకు రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన యాత్రలో భాగంగా ఫేజ్3 భూ పోరాట కేంద్రంలో కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. దేశంలో మతోన్మాదం పెరుగుతున్న నేపథ్యంలో రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కోసం ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఫేజ్3లో గుడిసెలు వేసుకున్న ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా, మండల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని సురవరం సుధాకర్‌రెడ్డికి ఘన నివాళులర్పించారు.

# మాటలతో కాదు.. అభివృద్ధి పనులతోనే సమాధానం

## - అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందిస్తాం
## - కాంగ్రెస్ కార్యకర్తలే నా కొండంత బలం.. ప్రజల సంక్షేమమే లక్ష్యం





గీసుగొండ, ఆగష్టు 22 హైదరాబాద్ ఎస్టేట్: మాటలతో కాకుండా అభివృద్ధి పనులతోనే సమాధానం చెబుతానని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. విమర్శలను పట్టించుకోకుండా ప్రజల కోసం పనిచేయడమే తన ధ్యేయమని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలే తనకు కొండంత బలమని, వారి సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గీసుగొండ మండలం ఉకల్ క్రాస్‌లోని ఎస్ఎస్ గార్డెన్‌లో గీసుగొండ, సంగెం మండలాలతో పాటు 15, 16, 17వ డివిజన్ల పరిధిలోని అర్హులైన పేద కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అర్హత ఉన్నప్పటికీ పలువురు పేద కుటుంబాలకు రేషన్ కార్డులు అందక ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. గీసుగొండ మండలంలో 11,648, సంగెం మండలంలో 16,752, 15వ డివిజన్‌లో 6,202, 16వ డివిజన్‌లో 2,164, 17వ డివిజన్‌లో 4,339 నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు రేవూరి ప్రకాశ్‌రెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టామని తెలిపారు. రేషన్ కార్డు కేవలం గుర్తింపు కార్డు మాత్రమే కాదని, పేద కుటుంబాలకు ప్రభుత్వం అందించే అనేక సంక్షేమ పథకాలకు ఇది కీలక ఆధారమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క కుటుంబం కూడా ప్రభుత్వ సంక్షేమానికి దూరం కాకుండా చర్యలు తీసుకుంటామని, అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. పేదల సంక్షేమం, ప్రజల అభ్యున్నతి, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని అన్నారు. రాజకీయ విమర్శలకు మాటలతో స్పందించడం కంటే ప్రజలకు కనిపించే అభివృద్ధి పనులతోనే సమాధానం చెబుతానని, కాంగ్రెస్ కార్యకర్తల అండతో ప్రజల కోసం మరింత సమర్థవంతంగా పనిచేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# ప్రజావాణిలో గోడు.. పరిష్కారం ఎప్పుడు?

## ఏళ్లుగా పరిష్కారం కాని భూ సమస్యపై రైతు ఆవేదన

## కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి



వరంగల్, ఆగస్టు 22 హైదరాబాద్ ఎస్టేట్: ప్రజావాణిలో పలుమార్లు దరఖాస్తులు సమర్పించినప్పటికీ తన భూ సమస్యకు ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని చెన్నారావుపేట మండలం కాదర్‌పేట గ్రామానికి చెందిన రైతు కూస సుదర్శన్ ఆవేదన వ్యక్తం చేశారు. తన సమస్యను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారుల నుంచి వాస్తవ వివరాలు తెప్పించుకుని న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో తన సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సుదర్శన్ తెలిపారు. కాదర్‌పేట నుంచి జిల్లా కేంద్రానికి వచ్చి దరఖాస్తులు సమర్పించేందుకు సమయం, ప్రయాణ ఖర్చులు వెచ్చించాల్సి వస్తోందన్నారు. తన దరఖాస్తు ప్రస్తుతం ఏ స్థాయిలో ఉందో, సంబంధిత శాఖలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో, సమస్య పరిష్కారానికి తదుపరి ప్రక్రియ ఏమిటో తనకు స్పష్టమైన సమాచారం అందడం లేదని తెలిపారు. భూ రికార్డులు, పట్టాదారు పాస్‌బుక్, సరిహద్దులు, రికార్డులలో సవరణలు వంటి అంశాలకు సంబంధించిన సమస్యలు పరిష్కారం కావడంలో జాప్యం జరిగితే రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. తన సమస్య విషయంలోనూ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులను పూర్తిగా పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. తన దరఖాస్తుపై ఇప్పటివరకు జరిగిన చర్యల వివరాలను తనకు తెలియజేయాలని సుదర్శన్ విజ్ఞప్తి చేశారు. ప్రజావాణిలో స్వీకరించే దరఖాస్తులపై నిర్ణీత వ్యవధిలో చర్యలు తీసుకుని, దరఖాస్తుదారులకు పురోగతిని తెలియజేసే విధానం మరింత సమర్థంగా అమలు కావాల్సిన అవసరం ఉందన్నారు. తన భూ సమస్యపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించాలని సుదర్శన్ కోరారు. తన దరఖాస్తుకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, వాస్తవ పరిస్థితులను నిర్ధారించిన అనంతరం చట్ట నిబంధనల ప్రకారం సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజావాణి ద్వారా తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకం ప్రజల్లో మరింత బలపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# యువతకు దిశానిర్దేశం చేసే శక్తి కళలు, సంస్కృతికే ఉంది

## ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షుడు, కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం






హన్మకొండ, ఆగస్టు 22: ఆధునిక కాలంలో చెడు సావాసాలకు లోనై యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోకుండా కళలు, చరిత్ర, సంప్రదాయాలు, సంస్కృతి వారికి దిశానిర్దేశం చేయగలవని ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షుడు ఈగ మల్లేశం అన్నారు. శనివారం హన్మకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, జేబీ కల్చరల్ ఆర్ట్ సొసైటీ (వరంగల్) ఆధ్వర్యంలో జరుగుతున్న 'ఓరుగల్లు జానపదాల స్వరాల ఝల్లు.. కాకతీయ సకల కళల జాతర' ఉత్సవాలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ.. ఓరుగల్లు ఘనమైన కళలకు, అద్భుతమైన సంస్కృతికి నిలయమని అన్నారు. తెలంగాణ జానపద కళలు, కాకతీయుల కళా సంపదను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. అంతరించిపోతున్న కళారూపాలను భావితరాలకు అందించేందుకు కళా ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు.తల్లిదండ్రులు తమ పిల్లలకు పురాణాలు, చరిత్ర, ప్రాచీన కళలు, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కళల ద్వారా యువతలో సంస్కారం, సామాజిక బాధ్యత, సృజనాత్మకత పెంపొందుతాయని తెలిపారు. తెలంగాణలో లిపి లేని 103 రకాల కళారూపాల కళాకారులు ఇప్పటికీ తమ కళలపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని ఈగ మల్లేశం ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి కళాకారుల జీవనోపాధిని కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుని ఆర్థికంగా అండగా నిలవాలని కోరారు.జడల శివ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జనగాం రాము వ్యాఖ్యాతగా వ్యవహరించారు. డా. హరిప్రియా హరినాథ్, శంకర్ సారంగపాణి శిష్యులు, పలువురు గాయకులు, కళాకారులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన జానపద, ఒగ్గు, చిందు, యక్షగానం, భగవతం, శాస్త్రీయ కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు.

# ఒడిశా తీరంలో ప్రమాదం..

## బంగాళాఖాతంలో మునిగిన కార్గో నౌక



ఒడిశా తీరానికి సమీపంలోని బంగాళాఖాతంలో శనివారం ఒక భారీ సరుకు రవాణా (కార్గో) నౌక మునిగిపోయింది. పనామా పతాకంతో ప్రయాణిస్తున్న ఈ నౌక, ఒడిశా నుంచి సింగపూర్‌కు ఇనుప ఖనిజం లోడ్‌తో వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాద సమయంలో నౌకలో 24 మంది సిబ్బంది ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు.పారాదీప్ తీరానికి సుమారు 240 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందిన వెంటనే ఇండియన్ కోస్ట్ గార్డ్, భారత నౌకాదళం రంగంలోకి దిగి సహాయక చర్యలు ప్రారంభించాయి. నౌకలోని సిబ్బందిలో ఎక్కువ మంది చైనా జాతీయులను ప్రాథమిక సమాచారం అందుతోంది.సహాయక చర్యల కోసం సమీపంలోని ఇతర నౌకలను కూడా అధికారులు అప్రమత్తం చేశారు. అయితే, ఇప్పటివరకు ఎంతమంది సిబ్బందిని సురక్షితంగా కాపాడారనే విషయంపై స్పష్టత రాలేదని ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి వెల్లడించారు. ప్రస్తుతం ఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
23 ఆదివారం ఆగస్టు 2026

## టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజా వేదికగా నిర్వహిస్తున్న పవర్ ఎగ్జిబిషన్2026ను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు ప్రారంభించారు.




హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి హైదరాబాద్
ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ నవీన్ మిట్టల్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఇతర డైరెక్టర్లు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌లో విద్యుత్ రంగంలోని ఆధునిక సాంకేతికతలు, భద్రతా చర్యలు, పునరుత్పాదక ఇంధన వనరులు, స్మార్ట్ మీటరింగ్, ఈవీ ఛార్జింగ్ వ్యవస్థలు తదితర అంశాలను ప్రజలకు ప్రదర్శిస్తున్నారు.

## బీజేపీ కొత్త టీమ్‌తో ప్రధాని మోదీ భేటీ




ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ నూతన జాతీయ పదాధికారులతో సమావేశమయ్యారు. కొత్త ఆలోచనలు, దృక్పథాలతో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజలతో పార్టీకి ఉన్న సంబంధాలను మరింతగా పెంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. సంస్థాగత సమావేశాలు ఇలాంటి కొత్త ఆలోచనలకు వేదికగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.సమావేశం అనంతరం ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఫోటోలను పంచుకున్నారు. "సంస్థాగత సమావేశాలు పార్టీని బలోపేతం చేయడానికి, ప్రజలతో సంబంధాలు పెంచుకోవడానికి కొత్త ఆలోచనలను అందిస్తాయి. కొత్త బృందంతో సమావేశం అద్భుతంగా జరిగింది," అని ఆయన పేర్కొన్నారు. పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ప్రధానికి బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్వాగతం పలికారు. ఈ వారం మొదట్లో ప్రకటించిన నితిన్ నబిన్ కొత్త జాతీయ బృందంతో ప్రధాని మోదీ భేటీ కావడం ఇదే తొలిసారి.ఈ కొత్తగా నియమించిన 65 మంది సభ్యుల బృందంలో 51 మంది కొత్త ముఖాలకు అవకాశం కల్పించడం గమనార్హం. రాబోయే రోజుల్లో చేపట్టబోయే పలు సంస్థాగత, ప్రజా సంబంధ కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా యువతతో మమేకం కావడమే లక్ష్యంగా 'యువ సంవాద్' (యువతతో సంప్రదింపులు) కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. 14 ఏళ్లు పైబడిన యువతను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమాల సమన్వయ బాధ్యతను భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం)కు అప్పగించారు.అలాగే, రాబోయే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై కూడా దృష్టి సారించారు. దీనిపై సమీక్షించేందుకు ఆదివారం పార్టీ అధ్యక్షుడు నితిన్ నబిన్.. రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, సంస్థాగత ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌ఛార్జ్‌లతో మరో సమావేశం నిర్వహించనున్నారు.

'వందేమాతరం'పై బీజేపీ తీర్మానం

ఇదే సమయంలో, 'వందేమాతరం' గౌరవాన్ని, చారిత్రక వారసత్వాన్ని కాపాడతామంటూ బీజేపీ శనివారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 1937 నాటి తీర్మానానికి కట్టుబడి, జాతీయ గీతంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా విమర్శించింది. మతపరమైన ఒత్తిళ్లు, రాజకీయ బుజ్జగింపులు, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వందేమాతరాన్ని కుదించే ప్రయత్నాలను వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. వందేమాతరం చరిత్ర, ప్రాముఖ్యతపై దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించింది.

## నారా లోకేశ్.. విద్యార్థుల్లో విద్యార్థిగా..

### టీచర్లలో టీచర్ గా..!



విద్యావ్యవస్థలో క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకునేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అనుసరిస్తున్న వినూత్న పంథా అందరినీ ఆకట్టుకుంటోంది. సంప్రదాయ పర్యటనలకు భిన్నంగా, ఎలాంటి ఆర్భాటాలు లేకుండా ఆయన నేరుగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో మమేకమవుతున్నారు. వారిలో ఒకరిగా కలిసిపోయి, సమస్యలను అడిగి తెలుసుకుంటూ అక్కడికక్కడే పరిష్కారాలకు చొరవ చూపుతున్నారు. "ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్" రూపకల్పనే లక్ష్యంగా ఆయన చేస్తున్న ఈ ప్రయత్నం విద్యావర్గాల్లో కొత్త ఆశలు రేపుతోంది.విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గంలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివీస్ సంస్థ సహకారంతో ఆధునీకరించిన భవనాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. గతంలో తాను ఈ పాఠశాలను సందర్శించినప్పుడు క్రీడా మైదానం మోకాలి లోతు నీటిలో ఉండటాన్ని గమనించారు. విద్యార్థుల ఇబ్బందులను అర్థం చేసుకుని, దివీస్ యాజమాన్యంతో మాట్లాడి అత్యాధునిక సౌకర్యాలతో పాఠశాలను అభివృద్ధి చేసేలా ఒప్పించారు. నేడు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మారిన తరగతి గదులు, ప్రయోగశాలలు, ఆధునాతన ప్లేగ్రౌండ్‌ను చూసి ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, ప్రసంగాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు మైక్ అందించి వారి అభిప్రాయాలు, ఆలోచనలు తెలుసుకున్నారు. వారు అడిగిన సరదా ప్రశ్నలకు అంతే ఉత్సాహంగా సమాధానాలిచ్చి వారిలో ఒకరిగా కలిసిపోయారు.అనంతరం విజయనగరం పర్యటనలోనూ లోకేశ్ తన ప్రత్యేకతను చాటుకున్నారు. దాసన్నపేట బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. అక్కడ ఉపాధ్యాయులకు కెమిస్ట్రీపై పునశ్చరణ తరగతులు జరుగుతుండగా, వారికి ఎలాంటి ఆటంకం కలిగించకుండా నిశ్శబ్దంగా వెళ్లి ఉపాధ్యాయుల మధ్య కూర్చున్నారు. శ్రద్ధగా పాఠం వింటూనే, విరామ సమయంలో వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన అంశాలపై తక్షణమే ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కార మార్గాలను అన్వేషించారు.మంత్రి హోదాను పక్కనపెట్టి, క్షేత్రస్థాయిలో వాస్తవాలను తెలుసుకునేందుకు లోకేశ్ అనుసరిస్తున్న ఈ ఆచరణాత్మక విధానంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది సమస్యల పరిష్కారం పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని అభిప్రాయపడుతున్నారు.

# సీఎంను విమర్శించే స్థాయి సుస్మితకు లేదు

### సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై వ్యాఖ్యలను ఖండించిన గీసుగొండ కాంగ్రెస్

### బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్..

### పరకాలపై రాజకీయ హక్కు ఉంటే ఎన్నికల్లో తేల్చుకోవాలని సవాల్



గీసుగొండ, ఆగష్టు 22 హైదరాబాద్ ఎస్టేట్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సుస్మిత పటేల్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను గీసుగొండ మండల కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి సుస్మిత పటేల్‌కు లేదని గీసుగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దాడి శివ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలు, అంతర్గత వ్యవహారాలపై పార్టీతో సంబంధం లేని వారు వ్యాఖ్యానించడం తగదని స్పష్టం చేశారు. గీసుగొండ మండలంలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, జిల్లా నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దాడి శివ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎవరికి ఎన్నికల టికెట్ ఇవ్వాలనే నిర్ణయం పార్టీ అధిష్ఠానం పరిధిలో ఉంటుందని, దానిపై బయటివారు వ్యాఖ్యానించడం సమంజసం కాదన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం తగదని దాడి శివ అన్నారు. రాజకీయ విమర్శలు విధానాలు, ప్రజా సమస్యలపై ఉండాలే తప్ప వ్యక్తిగత స్థాయికి వెళ్లకూడదని సూచించారు. పరకాల నియోజకవర్గంపై రాజకీయ హక్కు ఉందని భావిస్తే ప్రజల ముందుకు వచ్చి తమ రాజకీయ ప్రస్థానం, చేసిన సేవలను వివరించాలని అన్నారు. పరకాలపై తమకే హక్కు ఉందనే భావన ఉంటే ఎన్నికల్లో పోటీ చేసి ప్రజల తీర్పుతో నిరూపించుకోవాలని సవాల్ చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తుమ్మనపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పరకాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాదిగా ఉందన్నారు. 2012 తర్వాత కొండా కుటుంబం పరకాల రాజకీయాలకు దూరంగా ఉందని పేర్కొన్నారు. అలాంటి నేపథ్యంలో పరకాల రాజకీయాలపై హక్కు గురించి మాట్లాడటం సరికాదన్నారు. పరకాల ప్రజలతో అనుబంధాన్ని రాజకీయ ప్రకటనలతో కాకుండా ప్రజా సేవతో నిరూపించుకోవాలని సూచించారు. ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ రుద్ర ప్రసాద్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను సుస్మిత పటేల్ ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నగరబోయిన సారంగం మాట్లాడుతూ వంచనగిరి గ్రామానికి కొండా దంపతులు చేసిన పనులు, అక్కడి రాజకీయ పరిస్థితులపై గ్రామస్తుడిగా తనకు అవగాహన ఉందన్నారు. గతంలో కాంగ్రెస్ కార్యకర్తల మధ్య విభేదాలు ఏర్పడే పరిస్థితులు వచ్చాయని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి ఉన్న కార్యకర్తలమని, పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా పనిచేస్తామని నాయకులు తెలిపారు. వ్యక్తిగత విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వకుండా ప్రజా సమస్యలు, అభివృద్ధి, పార్టీ బలోపేతంపైనే దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గీసుగొండ మండల మాజీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మాజీ సర్పంచ్‌లు, ప్రస్తుత సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంను విమర్శించే స్థాయి సుస్మితకు లేదు

### సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై వ్యాఖ్యలను ఖండించిన గీసుగొండ కాంగ్రెస్

### బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్..

### పరకాలపై రాజకీయ హక్కు ఉంటే ఎన్నికల్లో తేల్చుకోవాలని సవాల్



గీసుగొండ, ఆగష్టు 22 హైదరాబాద్ ఎస్టేట్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సుస్మిత పటేల్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను గీసుగొండ మండల కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి సుస్మిత పటేల్‌కు లేదని గీసుగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దాడి శివ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలు, అంతర్గత వ్యవహారాలపై పార్టీతో సంబంధం లేని వారు వ్యాఖ్యానించడం తగదని స్పష్టం చేశారు. గీసుగొండ మండలంలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, జిల్లా నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దాడి శివ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎవరికి ఎన్నికల టికెట్ ఇవ్వాలనే నిర్ణయం పార్టీ అధిష్ఠానం పరిధిలో ఉంటుందని, దానిపై బయటివారు వ్యాఖ్యానించడం సమంజసం కాదన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం తగదని దాడి శివ అన్నారు. రాజకీయ విమర్శలు విధానాలు, ప్రజా సమస్యలపై ఉండాలే తప్ప వ్యక్తిగత స్థాయికి వెళ్లకూడదని సూచించారు. పరకాల నియోజకవర్గంపై రాజకీయ హక్కు ఉందని భావిస్తే ప్రజల ముందుకు వచ్చి తమ రాజకీయ ప్రస్థానం, చేసిన సేవలను వివరించాలని అన్నారు. పరకాలపై తమకే హక్కు ఉందనే భావన ఉంటే ఎన్నికల్లో పోటీ చేసి ప్రజల తీర్పుతో నిరూపించుకోవాలని సవాల్ చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తుమ్మనపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పరకాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాదిగా ఉందన్నారు. 2012 తర్వాత కొండా కుటుంబం పరకాల రాజకీయాలకు దూరంగా ఉందని పేర్కొన్నారు. అలాంటి నేపథ్యంలో పరకాల రాజకీయాలపై హక్కు గురించి మాట్లాడటం సరికాదన్నారు. పరకాల ప్రజలతో అనుబంధాన్ని రాజకీయ ప్రకటనలతో కాకుండా ప్రజా సేవతో నిరూపించుకోవాలని సూచించారు. ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ రుద్ర ప్రసాద్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను సుస్మిత పటేల్ ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నగరబోయిన సారంగం మాట్లాడుతూ వంచనగిరి గ్రామానికి కొండా దంపతులు చేసిన పనులు, అక్కడి రాజకీయ పరిస్థితులపై గ్రామస్తుడిగా తనకు అవగాహన ఉందన్నారు. గతంలో కాంగ్రెస్ కార్యకర్తల మధ్య విభేదాలు ఏర్పడే పరిస్థితులు వచ్చాయని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి ఉన్న కార్యకర్తలమని, పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా పనిచేస్తామని నాయకులు తెలిపారు. వ్యక్తిగత విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వకుండా ప్రజా సమస్యలు, అభివృద్ధి, పార్టీ బలోపేతంపైనే దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గీసుగొండ మండల మాజీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మాజీ సర్పంచ్‌లు, ప్రస్తుత సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు వేగవంతం చేయాలి

### - నాణ్యతలో రాజీ లేకుండా సకాలంలో పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి




పరకాల, ఆగష్టు 22 హైదరాబాద్ ఎస్టేట్: పరకాల పట్టణంలోని రాజుపేటలో నూతనంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరిశీలించారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ అయూబ్‌తో కలిసి నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించిన ఎమ్మెల్యే.. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు ఎలాంటి రాజీ లేకుండా, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, నిర్మాణంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ అందుబాటులోకి వస్తే స్థానిక విద్యార్థులకు ఆధునిక వసతులతో కూడిన నాణ్యమైన విద్య మరింత చేరువవుతుందని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసి పాఠశాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో చేపడుతున్న అభివృద్ధి పనులను శంకుస్థాపన నుంచి ప్రారంభోత్సవం వరకు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in
23 ఆదివారం ఆగస్టు 2026

# మీడియా అకాడమీ కార్యకలాపాలు అభినందనీయం

## జర్నలిస్టుల సంక్షేమం, శిక్షణకు చేస్తున్న కృషిపై ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రశంసలు

హైదరాబాద్, ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఇరిగిఅశోక్ఆగస్టు 22: జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి నైపుణ్యాల పెంపు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు తెలంగాణ మీడియా అకాడమీ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని దేశంలోని పలు రాష్ట్రాలతో ఏర్పడ్డ ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులు ప్రశంసించారు.

ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధి బృందం శనివారం మధ్యాహ్నం తెలంగాణ మీడియా అకాడమీ భవనాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్ శ్రీ కే. శ్రీనివాస్ రెడ్డి ప్రతినిధులకు అకాడమీ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు, జర్నలిస్టుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అకాడమీ కార్యదర్శి నాగుల్లపల్లి వెంకటేశ్వరరావు ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అక్రిడిటేషన్ సేవలు, విధి నిర్వహణలో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు అందిస్తున్న రూ.1 లక్ష ఆర్థిక సహాయం, వారి పిల్లలకు అందిస్తున్న ట్యూషన్ ఫీజు సహాయం, అలాగే జర్నలిస్టు కుటుంబాలకు అందిస్తున్న ఇతర సంక్షేమ కార్యక్రమాలను ప్రతినిధులకు వివరించారు.

తెలంగాణ ప్రభుత్వం డెస్క్ జర్నలిస్టులకు కూడా అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తుండటం పట్ల ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులందరూ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 23,000 మందికి పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేస్తూ, జర్నలిస్టుల వృత్తిపరమైన గుర్తింపు మరియు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అభినందించారు.

రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీలు, అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులు ఒక వినతిపత్రాన్ని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీ కె. శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. జర్నలిస్టుల సమస్యలను పరిశీలించి, వాటిని సంబంధిత ఎంపీలు మరియు అన్ని రాజకీయ పార్టీల దృష్టికి తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

అదేవిధంగా జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు, వర్క్‌షాపులు, అవగాహనా కార్యక్రమాల గురించి వివరించారు. శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనే జర్నలిస్టులకు ఉపయోగపడేలా అకాడమీ ప్రచురిస్తున్న మోనోగ్రాఫ్లు, పుస్తకాలు అందిస్తున్న విధానాన్ని కూడా ప్రతినిధులు పరిశీలించారు.

మీడియా అకాడమీ కోసం నిర్మించిన ఆధునిక సౌకర్యాలతో కూడిన ఐదు అంతస్తుల భవనం, శిక్షణా తరగతులు, గ్రంథాలయం, కంప్యూటర్ సౌకర్యాలు, సమావేశ మందిరం, 250 మంది సామర్థ్యం కలిగిన సెంట్రల్ ఏసీ ఆడిటోరియం తదితర సౌకర్యాలను ప్రతినిధి బృందం సందర్శించింది. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఇంతటి సమగ్ర మౌలిక వసతులతో అకాడమీ పనిచేయడం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

కొత్తగా ఏర్పడిన ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ కేవలం మరో సంస్థగా కాకుండా దేశవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తి ప్రమాణాలు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు బలమైన వేదికగా ఎదగాలని ప్రతినిధులు ఆకాంక్షించారు. జర్నలిస్టుల ఐక్యతను



బలోపేతం చేయడంతో పాటు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఫెడరేషన్ మరింత క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు.

మీడియా అకాడమీ ఆఫ్ తెలంగాణ నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తాయని, ముఖ్యంగా జర్నలిస్టుల సంక్షేమం మరియు శిక్షణ రంగాల్లో అకాడమీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఫెడరేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు.

మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు ప్రతినిధి బృందానికి అకాడమీ కార్యకలాపాలు, సంక్షేమ కార్యక్రమాలపై వివరాలు అందించారు.

ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్బుకు చెందిన నీలేష్ కాంతాహా, హారీష్ పగిడే, సంజయ్ మహతా (మధ్యప్రదేశ్), సోనాలి యాదవ్, దీపక్ మహేశ్వరీ, ఉదిత్ తండ్, ఉమాలీ



తండ్, లక్షణ్ ఫండ్, యాష్ వర్ధన్ సింగ్, రచనా జోషి, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రెసిడెంట్ గౌతమ్ పహాని, డా. స్నేహాశిస్ సూర్, జనరల్ సెక్రటరీ సౌరభ్ దుగ్గల్, మెంబర్ అనిల్ సింగ్, సెక్రటరీ జనరల్ రాజేష్ ధల్, మెంబర్ రమేష్ హండా, ట్రెజరర్ నీరజ్ ఠాకూర్, వివేక్ ముఖర్జీ, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ రెడ్డి, సెక్రటరీ రమేష్, ఏ. రాజేష్, మిడియా అకాడమీ మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, ఓ.ఎస్.డి. ఎమ్.కె. రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

---------------------------------------------------------------------------------------------------------------------------------------------జారీ చేసినవారు : శ్రీయుత కార్యదర్శి, తెలంగాణ మీడియా అకాడమి, హైదరాబాద్.

## ఘనంగా రాజా బహదూర్ వెంకట రామారెడ్డి 157వ జయంతి వేడుకలు

### మహిళా విద్యాభివృద్ధికి ఆయన ఆశయాలే స్ఫూర్తి: గుత్తా సుఖేందర్ రెడ్డి





హైదరాబాద్, ఆగస్టు 22: హైదరాబాద్ తొలి హిందూ కోత్వాల్, ప్రముఖ సంఘ సంస్కర్త, విద్యావేత్త రాజా బహదూర్ వెంకట రామారెడ్డి 157వ జయంతి వేడుకలను ఆర్‌బీవీఆర్ఆర్ మహిళా కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి మహిళా విద్యాభివృద్ధి, సామాజిక సంస్కరణలు, సమాజ సేవలో చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, ఆరోగ్యకర జీవన విధానం, సామాజిక బాధ్యతతో ఎదిగి సమాజ అభ్యున్నతికి తోడ్పడాలని సూచించారు.

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె. అచ్యుతా దేవి మాట్లాడుతూ, మహిళా సాధికారతకు రాజా బహదూర్ ఆశయాలు నేటికీ మార్గదర్శకమని అన్నారు. ఆయన కలలుగన్న సమాన విద్యా అవకాశాలను సాకారం చేయడంలో కళాశాల కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.

ఐదో న్యాక్ అక్రిడిటేషన్ చక్రంలో 'ఏ' గ్రేడ్ సాధించడం కళాశాల నాణ్యమైన విద్యకు నిదర్శనమన్నారు.

ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డిని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె. అచ్యుతా దేవి, వైస్ ప్రిన్సిపాల్ కె. సింధూరి, కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ ప్రొఫెసర్ సుదర్శన్ రెడ్డి, హెచ్ఎంవీఎస్ సెక్రటరీ ప్రొఫెసర్ కె. ముత్యంరెడ్డి ఘనంగా సత్కరించారు.జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, చర్చా వేదిక, పుస్తక సమీక్ష, ఫోటోగ్రఫీ, ఎక్స్టెంపోర్ స్పీకింగ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ముఖ్య అతిథి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.స్టూడెంట్ అడ్వైజరీ కమిటీ కన్వీనర్ డా. డబ్ల్యూ. శారద, కో-కన్వీనర్ డా. ఎం. పల్లవి ఆధ్వర్యంలో అధ్యాపక బృందం కార్యక్రమాన్ని సమన్వయం చేయగా, జాతీయ గీతాలాపనతో వేడుకలు ముగిశాయి.

## వినియోగదారులకు నాణ్యమైన సేవలే లక్ష్యం

### పెట్రోల్, డీజిల్, సహజవాయువు రంగంపై అధికారులకు ఎంపీ వద్దిరాజు సూచనలు




ముంబయి, ఆగష్టు 22 హైదరాబాద్ ఎస్టేట్: పెట్రోల్, డీజిల్, సహజవాయువు వినియోగదారులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన సేవలను సత్వరంగా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం అధ్యయన యాత్రలో భాగంగా రెండో రోజు శనివారం ముంబయిలో నిర్వహించిన సమావేశంలో ఎంపీ రవిచంద్ర పాల్గొన్నారు. స్థాయీ సంఘం చైర్మన్ సునీల్ దత్తాత్రే తట్కరే అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెట్రోలియం, సహజవాయువు రంగానికి సంబంధించిన పలు అంశాలపై అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులతో చర్చించారు. సస్టైనబుల్ ఆల్టర్నేటివ్ టువర్డ్స్ అఫర్డబుల్ ట్రాన్స్‌పోర్టేషన్ (సతత్) పథకం కింద ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ప్రోత్సహించేందుకు చేపడుతున్న చర్యలను సమావేశంలో సమీక్షించారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అవసరమైన రుణ సదుపాయాలు, ఆర్థిక సహకారంపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులను ఎంపీ రవిచంద్ర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పెట్రోలియం, సహజవాయువు రంగంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం, వాటి కార్యకలాపాలపై పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ, హెచ్ఎంఈఎల్, ఆర్ఐఎల్-బీపీ, జియో-బీపీ, వేదాంత, నయారా, అదానీ టోటల్, షెల్ సంస్థల ప్రతినిధులతో స్థాయీ సంఘం సభ్యులు సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ వినియోగదారుల నుంచి అందే ఫిర్యాదులపై సంబంధిత సంస్థలు, అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా సత్వర చర్యలు తీసుకుంటూ, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందేలా పర్యవేక్షణను మరింత పటిష్టం చేయాలని కోరారు.







